# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 21-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ యోగాను ప్రపంచ వ్యాప్తం చేయడంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- ❖ ఒత్తిడి, అశాంతిని అధిగమించేలా యోగా.. శాంతి మార్గాన్ని అందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని ఆపానన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలను భారత పూర్వ ఆర్మీ చీఫ్ జనరల్ వి.పి.మాలిక్ తోసిపుచ్చారు.
- ❖ ఆపరేషన్ సింధులో భాగంగా ఇరాన్ నుండి ఇప్పటివరకు 517 మంది భారత పౌరులను తీసుకువచ్చామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

=========================

దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈరోజు ఉత్సాహంగా, ఐక్యంగా జరుపుకున్నారు. డెహ్రాడూన్‌లో జరిగిన యోగా శిబిరంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. ప్రపంచ వేదికపై యోగాను ప్రోత్సహించడంలో భారతదేశం కీలక పాత్ర పోషిస్తోందని, ఖండాంతరాల్లోని ప్రజలు యోగాను గౌరవిస్తున్నారని ఆమె పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

పార్లమెంట్ ప్రాంగణంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నాయకత్వం వహించారు. న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆత్మను దైవంలో లయం చేసే ఏకైక మాధ్యమం యోగా అని అన్నారు. రోజువారీ జీవితంలో యోగా ఆవశ్యకతను వివరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ప్రతి ఒక్కరూ యోగాను స్వీకరించాలని సూచించారు. విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్.. నెహ్రూ పార్క్‌లో వివిధ దేశాల రాయబారులతో కలిసి యోగా సాధన చేశారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లఖ్‌పతి దీదీలతో

కలిసి పూసాలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవానికి హాజరయ్యారు. కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్.. జంతర్ మంతర్‌లో యోగా సాధన చేశారు. అలాగే కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ .. ఫిట్ ఇండియా అంబాసిడర్లతో కలిసి ఐజి స్టేడియంలో జరిగిన యోగా దినోత్సవానికి హాజరయ్యారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా.. పార్లమెంటు సభ్యుడు మనోజ్ తివారీతో కలిసి యమునా నది ఒడ్డున యోగా సాధన చేశారు.

========================

ఒత్తిడి, అశాంతి, అస్థిరతలను అధిగమించేలా యోగా శాంతి మార్గాన్ని అందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. విశాఖపట్నం సాగర తీరంలో జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ... యోగా కేవలం వ్యక్తిగత అభ్యాసంగా ఉండకూడదని, ప్రపంచ భాగస్వామ్యాలకు ఒక మాధ్యమంగా పరిణామం చెందాలని ఉద్ఘాటించారు. ప్రతి దేశంలోనూ యోగాను వారి జీవనశైలికి అనుసంధానం చేయాలని పిలుపునిచ్చారు. శాంతియుత, సమతుల్య, స్థిరమైన ప్రపంచాన్ని ముందుకు తీసుకెళ్లడానికి సమిష్టి ప్రయత్నాలు జరగాలని ఆకాంక్షించారు. దేశంలోని ప్రముఖ వైద్య సంస్థలు యోగా పరిశోధనల దిశగా చురుకుగా పని చేస్తున్నాయని, సమకాలీన వైద్య పద్ధతుల్లో దాని శాస్త్రీయ ఔచిత్యాన్ని నిర్ధారించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. యోగా ఫర్ వన్ ఎర్త్.. వన్ హెల్త్... అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం యోగా దినోత్సవాన్ని జరుపుకున్నామని, రాబోయే తరాలకు సంతోషకరమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడానికి ప్రపంచం ఎలా కలిసి వస్తుందో ఈ యోగా దినోత్సవం గుర్తు చేస్తుందని ప్రధానమంత్రి తెలియజేస్తూ....

(వాయిస్ 32 సెకన్ల)

========================

భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని ఆపానంటూ అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కార్గిల్ యుద్ధ సమయంలో భారత ఆర్మీ చీఫ్ జనరల్ గా విధులు నిర్వహించిన వి.పి.మాలిక్ తోసిపుచ్చారు. 1971 నుండి, భారతదేశం ఎప్పుడూ బయటి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదని ఆయన స్పష్టం చేశారు. యుద్ధాన్ని ఆపివేసానని, భారత్, పాకిస్తాన్ ల మధ్య కాశ్మీర్ వివాదాన్ని త్వరలో పరిష్కరిస్తానని ట్రంప్ చేసిన అసంబద్ధ వాదన సరికాదని ఉద్ఘాటించారు. ఈ విషయాన్ని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అప్పుడే స్పష్టం చేశారని ఆయన వివరించారు.

విరామం

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

========================

“ఆపరేషన్ సింధు” కార్యక్రమం కింద ఇరాన్ నుండి ఇప్పటివరకు భారతదేశానికి 517 మంది పౌరులను తిరిగి తీసుకువచ్చామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తుర్క్‌మెనిస్తాన్‌లోని అష్గాబాత్ నుండి ఒక ప్రత్యేక విమానం ఇరాన్ లోని భారతీయులను తీసుకొని ఈ తెల్లవారుజామున న్యూఢిల్లీకి చేరుకుంది. ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య కొనసాగుతున్న వివాదం కారణంగా అక్కడ నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఇరాన్ నుండి భారతీయ పౌరులను స్వదేశానికి తీసుకురావడానికి ఈ ఆపరేషన్ ప్రారంభమైంది. అలాగే గతరాత్రి 290 మంది

భారతీయ పౌరులతో కూడిన విమానం న్యూఢిల్లీకి చేరుకుంది. ఆపరేషన్ సింధులో భాగంగా, ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం.. ఆ దేశంలోని సున్నితమైన ప్రాంతాల నుండి భారతీయ పౌరులను సురక్షితమైన ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన సహాయాన్ని అందిస్తోంది. ఇరాన్‌లోని భారతీయ పౌరులు టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని, అలాగే న్యూఢిల్లీలోని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌తోను సంప్రదించాలని అధికారులు సూచించారు.

========================

గర్భధారణకు ముందు, తరువాత యోగా సాధన చేయడం వల్ల మహిళలు సంబంధిత అనారోగ్య సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనగలరని కేంద్ర మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ప్రినేటల్ యోగా, వివిధ భంగిమలు, ధ్యాన పద్ధతుల ద్వారా గర్భధారణ అసౌకర్యాలను నివారించవచ్చని తెలియజేశారు. యోగాను సాధన చేయడం ద్వారా నొప్పులను తగ్గించవచ్చని, అలాగే యోగ సాధన శక్తిని పెంచుతుందని ఆమె సందేశంలో వివరించారు. కాగా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పోస్టుపై స్పందిస్తూ... మహిళ, శిశు సంక్షేమ విభాగంలో యోగాను చేర్చడం గొప్ప విషయమన్నారు. ఈ విధంగా చేర్చడం వల్ల దేశమంతటా అట్టడుగు వర్గాల ఆరోగ్యం, శ్రేయస్సు పెరుగుతుందని పేర్కొన్నారు.

========================

ప్రధానమంత్రి విద్యాలక్ష్మి పథకం కింద రుణాలు పొందడంలో దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు మొదటి స్థానంలో నిలిచింది. గత సంవత్సరం నవంబర్ నుండి తమిళనాడు నుండి రికార్డు స్థాయిలో 4 వేల 590 మంది విద్యార్థులు ఈ పథకం కింద 7.5 లక్షల రూపాయల వరకు విద్యా రుణాలు పొందారని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. పీఎం విద్యాలక్ష్మి పథకం కింద కర్ణాటకలో 4 వేల 403 మంది, ఆంధ్రప్రదేశ్‌లో 3 వేల 428 మంది, తెలంగాణలో 2 వేల 590 మంది, కేరళలో 2 వేల 70 మంది లబ్ధిదారులు ఉన్నారని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పేర్కొంది. నవంబర్ 2024 లో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రారంభించిన ఈ PM-విద్యాలక్ష్మి పథకం, అర్హులైన విద్యార్థులు నాణ్యమైన ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవరోధాలను అధిగమించేందుకు దోహదపడుతుంది. దీని ద్వారా లబ్ధిదారులకు 7.5 లక్షల రూపాయల వరకు పూచీకత్తు, హామీదారు లేని విద్యా రుణాలను అందిస్తుంది.

========================

విధి నిర్వాహణలో అలసత్వం వహించిన ముగ్గురు ఉన్నతాధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) ఎయిర్ ఇండియా ను ఆదేశించింది. ఈ ముగ్గురు అధికారులను వెనువెంటనే విధుల నుండి తొలగించాలని ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది.

========================

========================